# మోక్షగుండం విశ్వేశ్వరయ్య




మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రఖ్యాత భారతీయ ఇంజనీరు, బహుముఖ ప్రజ్ఞాశాలి. నీతి నిజాయతీలకు, కచ్చితత్వానికి నిలువెత్తురూపం విశ్వేశ్వరయ్య. ఈయన నూతన మైసూరు( కర్ణాటక)రాష్ట్ర నిర్మాణానికి పితామహుడు. మైసూరు రాజ్యానికి దివాన్‌గా పనిచేసిన కాలంలో మైసూరు ఇనుము ఉక్కు కర్మాగారం, మైసూరు సబ్బుల కర్మాగారం, , బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూరులను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1860వ సంవత్సరం సెప్టెంబర్ 15వతేదీన బెంగళూరుకు సమీపంలోని ముద్దెన హళ్లి గ్రామంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు శ్రీనివాస శాస్త్రి, వెంకటలక్ష్మమ్మ. వీరి పూర్వికులు ఆంధ్రప్రాంతవాసులు. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని బెత్సవారిపేట మండలంలో ఉన్న మోక్షగుండం గ్రామంలో వారి సొంతఊరు. అయితే వారు మద్దెన హళ్లి ప్రాంతానికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఊరి పేరునే ఇంటిపేరు చేసుకోవడంతో మోక్షగుండం వారి ఇంటిపేరయ్యింది. విశ్వేశ్వరయ్య తండ్రి సంస్కృత భాషలో పండితుడు. విశ్వేశ్వరయ్యకు పదిహేనేళ్ల వయసులో ఆయన తండ్రి మరణించారు. విశ్వేశ్వరయ్య 1881 వసంవత్సరంలో మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ డిగ్రీ పొందారు. అనంతరం పుణే ప్రభుత్వ సైన్సు కళాశాల నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. ఆ కళాశాలే ప్రస్తుతం పుణే ఇంజనీరింగ్ కళాశాలగా పిలవబడుతోంది. ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే విశ్వేశ్వరయ్యకు బొంబాయి ప్రజాపనుల విభాగంలో ఉద్యోగం లభించింది. అనంతరం భారత నీటిపారుదల కమీషన్ లో చేరవలసిందిగా కమీషన్ నుంచి విశ్వేశ్వరయ్యకు పిలుపువచ్చింది. అందులో చేరిన ఆయన దక్కన్ ప్రాంతంలో నీటిపారుదల

సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగా ఎక్కువ మొత్తంలో నీటిని రిజర్వాయర్లో నిల్వ ఉంచేందుకు అవసరమైన ఫ్లడ్‌గేట్ల వ్యవస్థను విశ్వేశ్వరయ్య రూపొందించారు. ఆనకట్టకు ఏవిధమైన హానీ జరగకుండా గరిష్ట మొత్తంలో నీటిని నిల్వ ఉంచేందుకు ఈ వ్యవస్థ తోడ్పడింది. రిజర్వాయర్లో నీటిమట్టం గరిష్ట స్థాయిని చేరగానే ఫ్లడ్ గేట్లు వాటంతటవే తెరచుకొని నీటిని దిగువకు విడుదల చేస్తాయి. ఈ వ్యవస్థను విశ్వేశ్వరయ్య 1909వ సంవత్సరంలో అభివృద్ధి చేశాడు. పుణే సమీపంలోని ఖడక్‌వస్లా రిజర్వాయర్‌కు మొట్టమెదట ఈగేట్లను అమర్చారు. ఇవి మంచిఫలితాల్ని ఇచ్చాయి. తరువాతి కాలంలో గ్వాలియర్‌లోని టిగ్రా ఆనకట్టకు, కర్ణాటకలోని కృష్ణసాగర ఆనకట్టకూ ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నీటిపారుదల, మురికినీటి కాలువల వ్యవస్థను అభివృద్ధి చేసే ప్రాజెక్టుపై విశ్వేశ్వరయ్యను 1906 వ సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆఫ్రికా ఖండంలోని ఎడెన్ ప్రాంతానికి పంపింది. ప్రాజెక్టులో భాగంగా ఆయాప్రాంతాల్లో అభివృద్ధి చేయాల్సిన అంశాలపై ఆ ప్రాంత ప్రభుత్వానికి విశ్వేశ్వరయ్య నివేదిక సమర్పించాడు. ఆ నివేదికను ఎడెన్ ప్రభుత్వం అమలుపరిచింది. హైదరాబాద్ పట్టణంలో మూసీ నదికి వరద నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేయడంతోనూ, విశాఖపట్నం పోర్టు సముద్రపు కోతకు గురవ్వకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలకు సంబంధించి ప్రణాళిక రూపొందించడంతోనూ విశ్వేశ్వరయ్య పేరు ప్రఖ్యాతులు నలుదిశలా వ్యాపించాయి.

1908వ సంవత్సరంలో ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిన దేశాలను పర్యటించేందుకుఆయన విదేశాలకు వెళ్లేరు. 1909వ సంవత్సరంలో పర్యటన నుంచి తిరిగి వచ్చిన ఆయన మైసూరు రాజ్యానికి చీఫ్ ఇంజనీరుగా బాధ్యతలు స్వీకరించారు. 1912వ సంవత్సరంలో మైసూరు దివానుగా నియమితులయ్యారు. విశ్వేశ్వరయ్య దివానుగా 7 సంవత్సరాలపాటు పనిచేశారు. ఈ కాలంలోనే మైసూరు ఇనుము ఉక్కు కర్మాగారం, మైసూరు సబ్బుల కర్మాగారం, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూరు, బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం మెదలైన సంస్థల్ని ఏర్పాటు చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి నిరూపించిన వ్యక్తి విశ్వేశ్వరయ్య. విశ్వేశ్వరయ్య చేసిన ప్రజాసేవకు గుర్తుగా బ్రిటీష్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన కెసిఐఈ బిరుదునిచ్చి సత్కరించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం1955వ సంవత్సరంలో విశ్వేశ్వరయ్యకు భారతరత్న బిరుదునిచ్చి గౌరవించింది. లండన్‌కేంద్రంగా పనిచేస్తున్న ప్రఖ్యాత ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్‌లో 50 సంవత్సరాలపాటు మెంబర్‌గా కొనసాగి విశ్వేశ్వరయ్య రికార్డు

సృష్టించారు. వివిధ భారతీయ విశ్వవిద్యాలయాలు ఆయనను డాక్టరేట్లతో సత్కరించాయి. ఆయన జన్మదినం అయిన సెప్టెంబర్ 15నాడు ప్రపంచ ఇంజనీర్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1962వ సంవత్సరం ఏప్రియల్ 14న తన 101వ ఏట విశ్వేశ్వరయ్య పరమపదించారు.

సాక్షి